చెప్పాలనిపిస్తోంది — "సుజా!... ఈ ఒక్క రోజుకీ నువ్వు నా కోసం విసుక్కోవు కదూ? జన్మలో ... మన కిలాంటి రాత్రి ఎప్పుడు వస్తుంది చెప్పు?" అని బుజ్జగించి చెప్పగలడు, ఒప్పించగలడు.

అయినా సుజా అంత మనసులేని మనిషేం కాదు. రాత్రి పెళ్ళిలో నవ్వుతూ... తన కళ్ళకి దొరకకుండా తప్పించుకొంటూ... తనకి తెలీదా?—గదిలో అడుగు పెట్టగానే గదికి నాలుగువేపులా ఎక్కడెక్కడ గుమ్మాలున్నాయో — కిటికీ లున్నాయో చూడాలి. ఎవరు నవ్వుకున్నాసరే వరసగా అన్నీ మూసెయ్యాలి. తనేవీ ఎరగనట్టు గాఢంగా నిద్రపోతోన్నట్టు పడుకోవాలి. సుజా ఏం చేస్తుందో! అసలే సిగ్గు. పాపం కొత్త! కంగారుపడిపోతుంది. ఇక్కడి కొచ్చి నిద్రపోతున్నా డేవిటని చిరాకుపడిపోతుంది. పంతం కలదైతే పెంకిగా అలాగే తలుపులు కావిలించుకు నించుంటుంది. కొంచెం అమాయకురాలైతేమాత్రం సుకుమారంగా వచ్చి చెంపలు తాకుతుంది— సుజా ముందు మాట్లాడుతుందో లేదో చూడాలి.

వాసు ఒళ్లు పులకరించింది.

అసలు పెళ్ళి అన్నదగ్గిర్నుంచీ శోభనం రాత్రి గురించే కలలు కంటున్నాడు వాసు. పెళ్ళి పదిమందిమధ్యా బిక్కుబిక్కుమంటూ ఎలాగో అయిపోయింది. పంతు ళ్ళెంచెప్తే అదే చెయ్యాలి. ఆడవాళ్ళంతా గుమిగూడుతారు. ఊపిరి సలపనివ్వరు. మన సూరుకోక పెళ్ళి కూతుర్ని చూస్తే వదినగారిలాంటివాళ్ళు టక్కున పట్టేసి వేళాకోళాలతో కాల్చుకుతింటారు. ప్రాణానికి సుఖం వుండదు. స్వేచ్ఛ వుండదు — శోభనంరాత్రి అలా కాదు. కావలసినంత ఏకాంతం. సుజా ఒక్కతే అందంగా మెరిసిపోతూ పిచ్చెక్కించేలా వుంటుంది. ఎవరో చూస్తారనీ— నవ్వుతారనీ జంకు వుండదు. ఇద్దరూ... ఎంతో సన్నిహితంగా కూర్చుని... తనివి తీరా చూసుకుంటూ.. స్వర్గంలో క్షణంలా.. గడిపెయ్యచ్చు అనుకున్నాడు; గానీ, పెళ్ళి తతంగంకూడా సరదాగానే గడిచింది వాసుకి. పక్కపక్కన పీటలమీద కూర్చోటం —



